www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 30 | ఏప్రిల్ | 2026
పేజీలు : 8

## ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టొద్దు



-ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి
కలెక్టర్ అంకిత్

సెంటర్ స్ప్రెడ్

# పదిలో బాలికలదే పైచేయి



-ఖమ్మం జిల్లాలో 95.12 శాతం ఉత్తీర్ణత
-భద్రాద్రిలో 90.58 శాతం ఉత్తీర్ణత
-రాష్ట్రస్థాయిలో ఖమ్మం జిల్లాకు 25వ స్థానం
-శ్రీచైతన్య విద్యార్థి వృత్తిక కృష్ణ 597 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 95.12 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో ఖమ్మంజిల్లా 25వ స్థానంలో నిలిచింది. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పలువురు అత్యధిక మార్కులు సాధించారు. శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థిని వృతిక కృష్ణ 600 మార్కులకు గాను 597 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రస్తుతం మార్కుల విధానం ఉండగా 500లకు పైగా మార్కులు ప్రైవేటు పాఠశాలలతో పాటు ప్రభుత్వ, గురుకుల పాఠశాల విద్యార్థులు సాధించడం విశేషం. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలకు 16,958 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో 16,131 మంది ఉత్తీర్ణత సాధించి 95.12 శాతంతో రాష్ట్ర స్థాయిలో ఖమ్మం జిల్లా 25వ స్థానంలో నిలిచింది. ఈ ఫలితాలలో బాలికలదే పైచేయిగా నిలిచింది. పదవ తరగతి పరీక్షలకు బాలురు 8,737 మంది హాజరు కాగా 8,201 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 8,221 మందికి గాను 7,930 మంది ఉత్తీర్ణత సాధించారు. పదవ తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలో గతేడాది 94.47 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో 21వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం 95.12 శాతానికి పెరిగినప్పటికీ రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు 25వ స్థానానికి పడిపోయింది. ప్రైవేటు పాఠశాల విద్యార్థులు తమ హవాను

మిగతా 2లో..

# రైతు ముంగిట 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు



- కొనుగోళ్లు, చెల్లింపులు పారదర్శకంగా ఉండాలి
- పెనగడపలో ప్రారంభించిన కూనంనేని

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** నియోజకవర్గానికి ఎన్నడూలేని విధంగా రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయని, రైతులు కష్టాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నామని, ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. బుధవారం చుంచుపల్లి మండల పరిధిలోని పెనగడప గ్రామంలో నూతనంగా మంజూరైన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్ఏ మాట్లాడుతూ రైతుల కష్టాలు, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కృషితో గతంల ఎన్నడూ లేని విధంగా అత్యధిక సంఖ్యలో కేంద్రఆలను మంజూరు చేశామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ఐకేపి సిబ్బంది చూడాలని, తూకం

మిగతా 2లో..

## పరిశుభ్రతలో ఖమ్మంను
# మొదటి స్థానంలో నిలపాలి



-హైదరాబాద్‌కు మిన్నగా ఖమ్మం అభివృద్ధి
-రింగు రోడ్డు పూర్తయితే ట్రాఫిక్ కష్టాలు ఉండవు
-అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పరిశుభ్రతలో మూడవ స్థానంలో ఉన్న ఖమ్మం నగరాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు అధికార యంత్రాంగంతో పాటు ప్రజలు సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని 58వ డివిజన్‌లో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ వచ్చే 50 ఏళ్లకు ప్రజల అవసరాలకు

మిగతా 2లో..

# ప్రతీ దరఖాస్తును పరిష్కరిస్తాం




- సాదాబైనామాలకు 45రోజుల్లోనే విముక్తి
- త్వరలో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ
- ఆరెంపుల ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రజలు తమ సమస్యలపై ఇచ్చిన అర్హత కలిగిన ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తానని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. తొలుత జయజయహే తెలంగాణ గేయంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బండి సతీష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు...పది సంవత్సరాలు పరిపాలించిన బిఆర్ఎస్ పెద్దలు రాష్ట్రాన్ని ధ్వంసం చేశారన్నారు. కేవలం రాష్ట్ర సంపదను దోచుకోవడమే లక్ష్యంగా కమిషన్‌లతో లూటీకి పాల్పడ్డరని దుయ్యబట్టారు. పేదవాని కష్టం తెలీని ఆ ప్రబుద్ధులు ఈ నాడు ఈ ప్రభుత్వాన్ని విమర్శిస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. వరి వేస్తే ఊరే అన్న ప్రబుద్ధులు ఈరోజు రైతుల కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. మీరు రుణమాఫీ చేయడానికి పది సంవత్సరాలు పడితే ఈ ప్రభుత్వం ఏర్పడిన

మిగతా 2లో..

# పది ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థినికి స్టేట్ ఫస్ట్ ర్యాంకు







**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఖమ్మం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని కుంచాల వృత్తిక కృష్ణ 600 మార్కులకు గాను 597 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య లు తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో పాఠశాలకు చెందిన వృత్తిక కృష్ణ 597 మార్కులు, వంగవీటి పూజిత లక్ష్మి 595, ఆమన్ అమృత 595 మార్కులు సాధించారన్నారు. 590కు పైగా మార్కులు 70 మంది, 580కు పైగా మార్కులు 35 మంది విద్యార్థులు సాధించారన్నారు. శ్రీచైతన్య పాఠశాల సగటు మార్కులు 600లకు గాను 541 రావడం విశేషమన్నారు. అత్యధిక బ్రాంచీల్లో నూరు శాతం ఫలితాలు సాధించినట్లు వారు తెలిపారు. జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో కూడా తమ పాఠశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ వహించడం వల్లే ఇంతటి అద్భుత విజయం దక్కిందన్నారు. విద్యార్థుల కృషి, అంకిత భావంతో పనిచేసే అధ్యాపకుల వల్ల అద్భుత ఫలితాలు సాధించామన్నారు. సబ్జెక్టుల వారీగా నూరు శాతం మార్కులు సాధించిన విద్యార్థులు 995 మంది సాధించినట్లు తెలిపారు. ఇంతటి ఘన విజయానికి కారకులైన విద్యార్థులను, సహకరించిన తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన కె. వృత్తిక కృష్ణ భవిష్యత్తులో ఐఏఎస్ కావడమే లక్ష్యమని తెలిపింది.

# ప్రతీ దరఖాస్తును పరిష్కరిస్తాం

(మొదటిపేజీ తరువాయి)



రెండున్నర సంవత్సరాలలోపే చేసిందన్నారు. వీరు మరల అధికారంలోకి రావడం కోసం చేస్తున్న డ్రామలను ప్రజలు పరిశీలిస్తునేఉన్నారన్నారు. సాధరణ సమస్యలను వారం రోజుల్లోనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇక ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలకు గరిష్ఠంగా 3నెలల గడువు విధిస్తున్నామన్నారు. ఈ లోపు ప్రతి దరఖాస్తుకు ఒక స్పష్టమైన పరిష్కారం చూపడమే మా లక్ష్యం అని ప్రకటించారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న సాధన బైనామా సమస్యలను 45రోజుల్లోనే కొలిక్కి తెస్తామని కీలక ప్రకటన చేశారు. మొదటి విడతలో 4.5లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. త్వరలోనే రెండ విడత ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించనున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర దివాకర్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, విద్యుత్ ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూస్ శాఖల చీఫ్ ఇంజనీర్లు, జిల్లా స్థాయి అధికారులు, ఖమ్మంరూరల్ తహశీల్దార్ వినయేందర్‌రెడ్డి, ఎంపిడీఓ రవికుమార్, ఎంపీఓ శ్రీదేవి, ఆర్‌ఐలు ప్రసాద్, రవికాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, నాయకులు మద్ది మల్లారెడ్డి, బండి జగదీష్, అంబటి సుబ్బారావు, తోట వీరభద్రం, చింతమళ్ల రవికుమార్, పంతుల్‌నాయక్, గునిగంటి సురేష్, రమణ, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, అధికారులు పిఎస్‌ఆర్ సోషల్‌మీడియా ఇంచార్జ్ బద్రి సాయి తదితరులు పాల్గొన్నారు.


# మేడేను ఘనంగా నిర్వహించాలి




**ప్రజాపక్షం/సత్తుపల్లిః** పట్టణంలో మే ఒకటిన జరగబోయే మే డే ఉత్సవాలను వాడ,వాడలా ఘనంగా నిర్వహించాలని ఏ.ఐ.టి.యూ.సి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం సిద్దారం రోడ్డులోని ఆటో అడ్డా సంఘం సమావేశంలో పాల్గొని నిమ్మటూరి మాట్లాడుతూ 141వ మే డే లో నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలన్నారు. బ్రిటిష్ కాలం నాడు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని రామకృష్ణ ఈ సందర్భంగా కోరారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఆటో, హమాలి, స్కీమ్ వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధారం రోడ్డు ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిహెచ్ కాశిరావు, అడ్డా ఉపాధ్యక్షులు చాట్ల లక్ష్మయ్య, కొండపల్లి రాంబాబు, జక్కంపూడి వెంకట్, ప్రసాద్ సింగ్, గరికంటి అర్జున్ రావు, వినయ్, ప్రసాద్, సక్కుర్తి వెంకటేష్, మామిళ్ళ వెంకటేశ్వరరావు, మేకల విజయ్, తడికమళ్ళ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో

# న్యూఇరా, న్యూలిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల హవా



**ప్రజాపక్షం/వైరాః** సిబిఎసీ ప్రకటించిన పది ఫలితాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అగ్రస్థానం సాధించి నేడు రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన పది ఫలితాల్లో సుధా రక్షిత 579 మార్కులతో అగ్రస్థానంలో ఉండగా, బండి భవిష్య 578, రెడ్డెం శ్రీలక్ష్మి మేఘనరెడ్డి 571 మార్కులతో పాటుగా 50% మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాదజంచడం, మిగతా విద్యార్థులు 60% పైగా మార్కులు సాధించడం పట్ల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు మాట్లాడుతూ, న్యూలిటిల్ పాఠశాల మొదటి నుండి నిలకడతో కూడిన ఫలితాలు సాధిస్తూనే ఉంది. సిబిఎస్ఈ బోర్డు పది ఫలితాల్లో, స్టేట్ బోర్డ్ పది ఫలితాల్లో రాష్ట్రస్తాయి మార్కులు సాధించడం వైరా పట్టణానికి గర్వకారణం, బోర్డు ఏదైనా సరే మేము క్రమశిక్షణ, పట్టుదలతో అహర్నిశలు ఇష్టంతో కష్టపడి భవిష్యత్తులో అద్భుత విజయాలను అందుకుంటామని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.భూమేష్‌రావు, స్కూల్ ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ, ఏవో నర్సింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థినికి రూ.20వేలు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/వైరాః** వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బిటెక్ చదువుతున్న నిరుపేద విద్యార్థినికి రూ.20వేలను జిల్లా మార్కెట్ కోఆర్డినేటర్ లయన్ లగడపాటి ప్రభాకర్‌రావు పుట్టినరోజు పురస్కరించుకొని వారి ధాతృత్వంతో బుదవారం మున్సిపల్ కార్యాలయంలో ఫాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ మురళీకృష్ణ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ వైరా లయన్స్‌క్లబ్ ద్వారా అనేకమ ంది విద్యార్థిని, విద్యార్థులకు చదువులు నిమిత్తం సహాయ సహకారాలు అందించామని, పై చదువులు నిమిత్తం ఎంతో మందికి ఆర్థికంగా ఆదుకున్నామని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు చదువులో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజన్ కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు, రీజియన్ సెక్రటరీ పెనుగొండ ఉపేందర్‌రావు, వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వై.బుచ్చిరామారావు, సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరావు, కోశాధికారి గద్దె నీరజ, లయన్స్ క్లబ్ సభ్యులు ఏపూరి రాజారావు, పుల్లి కృష్ణార్జున్‌రావు, సుగ్గల మాధవి, తిరుపతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# 'పది'లో బాలికలదే పైచేయి

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగించారు. ఖమ్మం నగరంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని 600 మార్కులకు గాను 597 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. అదేవిధంగా పలు పాఠశాలల విద్యార్థులు 595, 591, 590 వంటి మార్కులు సాధించారు.

## భద్రాద్రిలో బాలికలదే హవా..

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లోనూ బాలికలే పై చేయి సాధించారు. మొత్తంగా 90.58 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పరీలకు 12703 మంది విద్యార్థుళు హాజరుకాగా, 11506 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 6192 మందికి గానూ 5502 మంది పాస్ కాగా 88.86 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 6511 మందికి గానూ 6004 మంది ఉత్తీర్ణత సాధించి 92.21శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. బాలుర కంటే బాలికలు 3.35 శాతం ఉత్తీర్ణ సాధించారు. 302 పాఠశాలల నుండి విద్యార్థులు పరీక్షలు రాయగా 62 పాఠశాలల వారు నూరు శాతం ఫలితాలు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎంఇఓ నాగలక్ష్మీ అభినందిస్తూ ఆశీర్వదించారు. విద్యార్థులు రీ కౌటింగ్, రీ వెరిఫికేషన్ వచ్చే నెల 14లోపు దరఖాస్తులు చేసుకోవాలని. అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు జూన్ 5వ తేది నుండి 12వ తేది వరకు జరుగుతాయని చెప్పారు.

# రైతు ముంగిట 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

(మొదటిపేజీ తరువాయి)




విషయంలో పారదర్శకత పాటించాలని సూచించారు. తేమ పేరుతో రైతులను ఇబ్బందుల పాలు చేయవద్దని, సరిపడా గిన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజ కొనుగోలు చేయడం జరుగుతుందని, దళారుల మాయ మాటలు నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దని చెప్పారు. కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని, విక్రయం అనంతరం రైతులకు ఖాతాల్లో నగదు జమలు సకాలంలో జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతు పక్షపాతిగా ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, ఎంపిడిఓ శుభాషిణి, తహశిల్దార్ నాగరాజు, సర్పంచ్ కారం సీతారాములు, ఉప సర్పంచ్ గోరె బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ, నాయకులు నీడాల సుధాకర్, కుంచం కుమార్, కట్ట సత్యనారాయణ, మేఘనాథం, తాజుద్దీన్, ఐకిపే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతలో ఖమ్మంను మొదటి స్థానంలో నిలపాలి

(మొదటిపేజీ తరువాయి)

తగినట్లుగా ఖమ్మం నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నగరాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు చేపట్టాలన్నారు. పది కాలాల పాటు పనులు నాణ్యతతో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం అన్ని రోడ్లకు మార్కింగ్ చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ కంటే మిన్నగా ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని డివిజన్లకు సమ ప్రాధాన్యత కల్పిస్తూ అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఖమ్మం నలు వైపులా జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుందని వాటితో పాటు రింగు రోడ్డు పూర్తయితే ఖమ్మం నగరంలో ట్రాఫిక్ కష్టాలు ఉండవని తెలిపారు. పరిశుభ్రతలో మూడవ స్థానంలో ఉన్న ఖమ్మంను మొదటి స్థానంలో నిలిపేందుకు అధికార యంత్రాంగం పని చేయాలన్నారు. అందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఖమ్మంను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మెగాజాబ్‌మేళాలో నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని మంత్రి కోరారు. అభివృద్ధితో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహారా, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, సాధు రమేష్ రెడ్డి, పాలెపు వెంకటరమణ, శెట్టి రంగారావు, నాయకులు పాల్గొన్నారు.

# పదిలో రఘునాథపాలెంలో 87 శాతం ఉత్తీర్ణత

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పదవ తరగతి ఫలితాల్లో రఘునాథపాలెం మండలంలో 87 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో రాములు తెలిపారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో మండల వ్యాప్తంగా 288 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 250 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని 38 మంది ఫెయిల్ అయినట్లు ఎంఈవో తెలిపారు. చిమ్మపుడి ఉన్నత పాఠశాల 89 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని, ఈర్లపుడి ఉన్నత పాఠశాల 91 శాతం, కామంచికల్ ఉన్నత పాఠశాల 83 శాతం, మంచుకొండ పాఠశాల 89 శాతం, పాపటపల్లి పాఠశాల 79 శాతం, వి. వెంకటాయపాలెం పాఠశాల 90 శాతం, రఘునాథపాలెం పాఠశాల 86 శాతం, కెజిబివి రఘునాథపాలెం పాఠశాల 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. రఘునాథపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థిని బానోత్ పరమేశ్వరి అత్యధిక మార్కులు 554 మార్కులు సాధించిందన్నారు. కామంచికల్ పాఠశాల విద్యార్థిని చింతకాయల త్రివేణి 544 మార్కులు సాధించిందన్నారు. అదేవిధంగా ఎంజెపిటి బిసి వెల్ఫేర్ బాలుర రఘునాథపాలెం పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు కేలోత్ లక్ష్మణ్ 581 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఎంపిజే బిసి వెల్ఫేర్ బాలికలు దానవాయిగూడెం పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించారని, జి. కావేరి 578 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఎంపిజె బాలికల చెరువుమాధారం పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించారని, డి. లావణ్య 565 మార్కులు సాధించినట్లు తెలిపారు. మైనార్టీ గురుకుల పాఠశాల ఖమ్మం 1 విద్యార్థులు 99 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని షేక్ సనా 568 మార్కులు సాధించిందన్నారు. రఘునాథపాలెం విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించారని సిద్దం రాణా 583 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు.

# ఉపాధి హామీలో ఎన్ఎంఎంఎస్ పద్ధతిని రద్దు చేయాలి




**-తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్రవేశపెట్టిన ఎన్ఎంఎంఎస్ వలన ఉపాధి హామీలో పనిచేస్తున్న కార్మికులకు నష్టం జరుగుతుందని దీనిని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పగిడిపల్లి ఏసు లు డిమాండ్ చేశారు. బుధవారం చింతకాని మండలం రామకృష్ణాపురం, బస్వాపురం గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వారు పరిశీలించారు. ఎన్ఎంఎంఎస్ పద్ధతిలో రోజుకు రెండుసార్లు ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాలని పైన సర్వర్ బాగుంటేనే ఫోటోలు అప్‌లోడ్ అవుతాయని, గ్రామాల్లో టెలిఫోన్ సిగ్నల్ సరిగ్గా లేకపోతే ఫోటోలు అప్‌లోడ్ కాకపోవడంతో ఉపాధి హామీ కూలీలు పనిలో చేరడం కుదరదు. రెండో సారి గ్రూప్‌గా ఫోటో తీసుకోవాలని సాంకేతిక కారణాల వల్ల రెండో సారి ఫోటో తీసుకోనందున ఆ కార్మికులు రెండో రోజున పనికి రావడం కుదరదు. మూడో రోజు తిరిగి పేరు నమోదు చేసుకుని పనిలో చేరాలి. ఏ రోజుకారోజు నమోదు కాకపోతే వేతనాలు జమ కావడం లేదని వారు తెలిపారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఎన్ఎంఎంఎస్ నిబంధనను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రోజు కూలీ డబ్బులు వారం వారం ఖాతాలో జమ చేయాలి కానీ సుమారు జనవరి నెల నుంచి జమ కావడం లేదన్నారు. వారి ఖాతాలో వేశామని కార్మికులకు చెబుతున్నారు కానీ ఖాతాలో జమ కావడం లేదు. ప్రభుత్వం జోక్యం చేసుకుని కూలీ డబ్బులు అందేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుత ధరల కనుగుణంగా రోజు కూలీ రూ. 700లు చెల్లించేలా షెడ్యూల్ రేట్లు మార్చాలని వారు కోరారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో అదనపు అలవెన్సులు తక్షణమే ఇవ్వాలన్నారు. వడగాల్పులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని వారు కోరారు.

## జనగణనను పకడ్బందీగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/చింతకాని:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జనగణనను పకడ్బందీగా నిర్వహించాలని చింతకాని తహసీల్దార్ బాబ్జీప్రసాద్ తెలిపారు. చింతకాని మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న జనగణన ఎన్యూమరేటర్స్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ సిబ్బంది ఎలాంటి తప్పిదాలు లేకుండా సర్వే పూర్తిచేయాలని, మండల ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, ఎంఈవో రామారావు, మాస్టర్ ట్రైనర్స్, ఏఈఏవో, పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ బోనకల్:** విద్యుత్‌షాక్‌కు గురై ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మండల పరిధిలోని చిన్నబీరవల్లి గ్రామంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చిన్నబీరవల్లి గ్రామానికి చెందిన బొంగా గోపినాథ్(30) తన ఇంటి పరిధిలో గల మోటార్‌ను రిపేర్ చేస్తుండగా ఆకస్మాత్తుగా విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి చేరడంతో ప్రథమ చికిత్స అనంతరం బంధువులు మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. గోపినాథ్ అకాల మృతితో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ముగిసిన జనగణన శిక్షణ



**ప్రజాపక్షం/ బోనకల్:** బోనకల్ మండలంలో గత ఆరు రోజులుగా నుండి ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు నిర్వహిస్తున్న జనగణన శిక్షణాతరగతులు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమాదేవి హాజరై ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ఇండ్ల గణన, ఇండ్ల జాబితాకు సంబంధించిన పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఇఓ దామాల పుల్లయ్య మాట్లాడుతూ బోనకల్ మండలంకు సంబంధించిన ఎన్యూమేటర్‌లకు, సూపర్వైజర్లకు శిక్షణ పూర్తయిందని, 90మంది శిక్షకులు పాల్గొన్నారని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాలకు మాస్టర్ ట్రైనర్లుగా టి.రత్నకుమార్, జల్లా విశ్వనాథం, కోఆర్డినేటర్‌గా ఎస్ఓ నజీర్, టెక్నికల్ అసిస్టెంట్‌గా పాల్ వ్యవహరించారు.

## ఎస్ఎస్‌సి ఫలితాల్లో త్రివేణి జైత్రయాత్ర




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్ఎస్‌సి ఫలితాల్లో త్రివేణి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జైత్రయాత్ర కొనసాగించారని పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థి 600 మార్కులకు 596 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఒకరు 592 మార్కులు, ఇద్దరు 591, ఒకరు 587, నలుగురు 586, నలుగురు 585, ఒకరు 584, ఆరుగురు 583, నలుగురు 582, ఏడుగురు 581, ఒకరు 580 మార్కులు సాధించినట్లు తెలిపారు. 580 మార్కులకు పైగా 33 మంది విద్యార్థులు, 570కు పైగా 81 మంది, 550కు పైగా 268 మంది, 500కు పైగా 750 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. గతంలో గ్రేడుల విధానంలోనూ నేడు మార్కుల విధానంలోనూ త్రివేణి పాఠశాల విద్యార్థులు జైత్రయాత్ర సాగించారన్నారు. అత్యధిక బ్రాంచీలలో వంద శాతం ఉత్తీర్ణతతో తెలంగాణలో నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా బోధన అందిస్తూ ప్రణాళికాబద్ధంగా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నామన్నారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా విద్యార్థులకు పటిష్ట పునాదిని అందిస్తున్నామన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

## ఎస్ఎస్‌సి ఫలితాల్లో రెజొనెన్స్ ఇన్ఫో ప్రభంజనం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్ఎస్‌సి ఫలితాల్లో ఖమ్మం నగరంలోని రెజొనెన్స్ ఇన్ఫో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారని పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, కె. శ్రీధర్‌రావు, నీలిమలు తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో ఎస్. దినేష్ 600 మార్కులకు 583, బి. సాయి బుద్ధ కౌశిక్ 576, సిహెచ్ వంశీతేజ 575, వర్షిత్ 570, పి. శృతి 568, బి. యామిని 568, బి. చరణ్ 567, కె. పూజ 566, కె. జగదీష్ 565, ఎండి ఎతిషం అలీఖాన్ 564, ఎం. సూరజ్ భార్గవ్ 562, ఎ. విశాల్ 562 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రతి ఇద్దరిలో ఒకరు 500లకు పైగా మార్కులు సాధించడంతో పాటు నూరు శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ప్రతి సబ్జెక్టులోనూ వందకు వంద మార్కులు సాధించారన్నారు. తమ పాఠశాలలో చక్కటి ప్రణాళికతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం వల్లే ఉత్తమ ఫలితాలు సాధించగలిగామని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆర్‌వి నాగేంద్రకుమార్, కె. శ్రీధర్‌రావు, నీలిమ తదితరులు అభినందించారు.

## సత్తుపల్లిలో ఎస్ఎస్‌సి ఫలితాల సందడి

**-ప్రభుత్వ పాఠశాలలో 94% ఉత్తీర్ణత**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సత్తుపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు 94 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలోనే మెరుగైన ఫలితాలు సాధించినట్లు ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 528 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 498 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు.

**నూటికి నూరు శాతం సాధించిన పాఠశాలలు....**

మండలంలోని 5 ప్రభుత్వ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటాయన్నారు. జెడ్పీ హైస్కూల్ రేజర్ల, జెడ్పీహెచ్ఎస్ సదాశివునిపాలెం, జెడ్పీహెచ్ఎస్ ఎన్టీఆర్ నగర్ సత్తుపల్లి, జెడ్పీహెచ్ఎస్ సత్తుపల్లి, సానా మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ (బి) సత్తుపల్లి పాఠశాలల్లో హాజరైన విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

**టాప్ స్కోరర్లు..**

జెడ్పీహెచ్ఎస్ సదాశివునిపాలెం విద్యార్థిని జి. లాస్య ప్రసన్న 578 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. జెడ్పీ హైస్కూల్ రేజర్లకు చెందిన ఎ. అస్రిజ లహరి 567 మార్కులు, జెడ్పీహెచ్ఎస్ కిష్టారం విద్యార్థిని సిహెచ్ కావ్య శ్రీ ఉన్నతి 566 మార్కులు, ఎన్టీఆర్ నగర్ పాఠశాల విద్యార్థి విమల్ కిరణ్ భార్గవ్ 565 మార్కులు సాధించారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సత్తుపల్లి 97%, కాకర్లపల్లి 95%, తుంబూరు 94%, కిష్టారం 92%, బాలికల ఉన్నత పాఠశాల సత్తుపల్లి 90%, బేతుపల్లి గంగారం 87% ఉత్తీర్ణత నమోదు చేశాయి. మండల వ్యాప్తంగా 14 మంది విద్యార్థులు 550 మార్కులకు పైగా సాధించడం విశేషం. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను మండల విద్యాధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

## ఎస్ఎస్‌సి ఫలితాల్లో స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ విజయకేతనం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్ఎస్‌సి ఫలితాల్లో ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి విజయకేతనం ఎగురవేశారని పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు జి. సాయితేజ అశ్రీత్ 600 మార్కులకు 586, ఎస్‌కె యాసినా 578, ఎం. భావనరెడ్డి 577, బి. సాయిషణ్ముక శ్రీనివాస్ 577, ఎం. సౌమ్యశ్రీ 576, వై. సిరికాంక్ష 574, డి. ప్రసన్న 573, జి. రిషిత 572 మార్కులు సాధించారని తెలిపారు. 550కు పైగా మార్కులు 20 మంది, 540కు పైగా 27 మంది, 520కు పైగా 38 మంది, 500లకు పైగా 51 మంది విద్యార్థులతో పాటు నూరు శాతం ఫలితాలను సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణిలు అభినందించారు. సామాన్య విద్యార్థులతో అసమాన ఫలితాలు సాధించినట్లు వారు తెలిపారు. తమ పాఠశాలలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదిలో సెయింట్ ఫ్రాన్సిస్ విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం/మధిర :** రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలైన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో మధిర పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఎస్.ప్రణవి 578/600 అత్యధిక మార్కులు సాధించి స్టేట్ టాప్ ర్యాంకర్‌గా నిలిచింది. అదేవిధంగా పి.అభిలాష్ 571/600, బి.ప్రియ 571/600, ఎం. రాజదుర్గారావు 570/600, కె.శ్రీవిద్య 570/600 మార్కులతో రాష్ట్రస్థాయిలో నిలిచారని స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ మేరీ థామస్, ప్రిన్సిపాల్ సిస్టర్ ఆన్‌బెబి తెలిపారు. 10వ తరగతిలో 57మందికి గాను 57మంది విద్యార్థినీ, విద్యార్థులు పాసై నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను వీరితో పాటు వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతి, 10వ తరగతి కోఆర్డినేటర్ వెంకటనారాయణ, సిబ్బంది అభినందించారు.

## పదిలో ఆదర్శ విద్యార్థుల విజయ దుందుభి




**ప్రజాపక్షం/చింతకాని :** బుధవారం విడుదలైన పదవతరగతి పరీక్షా ఫలితాల్లో నాగులవంచ శ్రీఆదర్శ హైస్కూల్ విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ బోడెపుడి కిరణ్ పేర్కొన్నారు. తమ పాఠశాలలో మొత్తం 29 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 29 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని 28 మంది ప్రథమ శ్రేణిలో, ఒక్కరు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు ఆయన తెలిపారు. జక్కుల భాను ప్రసాద్ 550 మార్కులు, మంద విష్ణు 547, సీహెచ్ జోష్ణ 539, అనగాని నక్షత్ర 527, కె మదన్ కుమార్ 522, జొన్నలగడ్డ సుకేష్ 511 , బండి లక్ష్మీప్రసన్న 511 మార్కులు సాధించారని తమ పాఠశాలలో చదువుతో పాటు క్రమశిక్షణ అందిస్తున్నామన్నారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ చావా అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు బోళ్ల రేణుక, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, పుల్లారావు, సుధాకర్, ప్రశాంతి, పార్వతి, సుజాత, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో బోనకల్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/బోనకల్ :** బుధవారం విడుదలైన ఎస్ఎస్సీ ఫలితాల్లో బోనకల్ మండల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి మంచి మార్కులు సాధించినట్లు బోనకల్ మండల ఎంఇఓ దామాల పుల్లయ్య తెలిపారు. మండలంలోని 211మంది విద్యార్థులకు గాను 191 మంది విద్యార్థులు పాసై 91శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మండలంలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు టి.భానుప్రకాశ్ 560(అళ్ళపాడు), టి.చంద్రిక 546(రావినూతల), ఎం.మధువిక 542(ముష్టికుంట్ల) మార్కులు సాధించినట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయనతో పాటలు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ వెంకటేశ్వర ఆలయంలో మహాన్నదానం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర బంజారాకాలనీ శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మహాన్నదాన కార్యక్రమాన్ని దేవాలయ కమిటీ అధ్యక్షులు మల్లాది వాసు ప్రారంభించారు. ఈసందర్భంగా కమిటీ అధ్యక్షులు వాసు మాట్లాడుతూ దేవాలయ17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, ఆలయ కమిటీ సభ్యులు గుర్రం రామారావు, నంబూరు శ్రీహరి, కళ్యాణం పుల్లారావు, పుతుంబా శ్రీకృష్ణ ప్రసాద్, రేగళ్ల సునీత, బ్రాహ్మారెడ్డి, గద్దం రమేష్, భక్తులుపాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## నిరాహార దీక్షను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/ బోనకల్ :** ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యల పరిష్కారం కోరుతూ మే 5న ఖమ్మం జిల్లా కేంద్రంలో టిజిఇజెఎసి ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షను విజయవంతం చేయాలని టిపిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ బుధవారం జరిగిన ఉపాధ్యాయ సమావేశంలో ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈసమావేశంలో టియుటిఎఫ్ నాయకులు, ఎఫ్‌డబ్ల్యుఎఫ్ కన్వీనర్ జిల్లా కోటయ్య, మండల కోశాధికారి పి.నర్సింహారావు, పిఆర్‌టియు జిల్లా నాయకులు రత్నకుమార్, రామ్మోహన్, పి.గోపాలరావు, బి.సౌభాగ్యలక్ష్మి, సోషల్ మీడియా కన్వీనర్ నరేంద్ర సింహా తదితరులు పాల్గొన్నారు.

# బాలికల సంక్షేమం, రక్షణే ప్రభుత్వ ధ్యేయం : ఎంఎల్‌ఏ



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో రైతు వేదిక నందు చంద్రుగొండ ప్రాజెక్ట్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల సంక్షేమం, భద్రతను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పని చేస్తోందనీ తెలిపారు. బాలికల భవిష్యత్తు బలోపేతం కావాలంటే విద్య, ఆరోగ్యం, భద్రత రంగాల్లో సమగ్ర చర్యలు అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం బాలికల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని ప్రతి అర్హురాలికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు వంటి సమస్యలను నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదే విధంగా పాఠశాల స్థాయిలోనే బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖతో పాటు పోలీస్ విభాగం సమన్వయంతో పని చేస్తూ బాలికల రక్షణకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ లాకావతు లక్ష్మి, ఎంపీడీవో మహాలక్ష్మి, జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, సిడిపిఓ సలోమి, సూపర్వైజర్లు మహాలక్ష్మి, అరుణ, హెల్త్ సూపర్వైజర్, మహిళా సంఘాల ప్రతినిధులు, జ్యోతి, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను ప్రారంభించిన సర్పంచ్



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలం పరిధిలోని పాతరెడ్డిపాలెం గ్రామ పంచాయితీలో బుధవారం ఉపాధి హామీ పనులను సర్పంచ్ సాగబోయిన నాగకుమారి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కూలీలందరికీ ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి కూలీకి పని కల్పించి, ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటామని, ఈ పథకం పేద ప్రజలకు పని దినాలు కల్పించి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె అన్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి పీటర్ పాల్, ఉపాధి హామీ సిబ్బంది, పాల్గొన్నారు.

## కిడ్నీ రోగుల కోసం డయాలసిస్ కేంద్రం

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ మంజూరు కావడం మండల ప్రజలకు పెద్ద ఊరటనిచ్చింది. ముఖ్యంగా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఇకపై దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ మండల కేంద్రంలోనే చికిత్స పొందగలగడం ఒక కీలక మార్పుగా నిలిచింది. ఈ సందర్భంగా అశ్వాపురం మండల కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి రమేష్ బాబు మాట్లాడుతూ పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు విక్రమార్కుడిలా పట్టుదలతో కృషి చేసి ఈ డయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేయించారని అభినందించారు. ప్రజల ఆరోగ్య సమస్యలను దగ్గరగా గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడం ఎంఎల్‌ఏ యొక్క చిత్తశుద్ధిని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. రోగులకు ఈ సెంటర్ ద్వారా ఉపశమనం లభించనుంది. ముఖ్యంగా మండలంలోని 24 గ్రామ పంచాయితీల ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, 4 మండలాల్లో డయాలసిస్ కేంద్రాలను మంజూరు చేయించిన ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు కృషిని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి అశ్వాపురం మండల ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఇది ఒక కీలక అడుగుగా నిలిచిందని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ఈ చర్య ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బిజెపి నాయకులు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండలకేంద్రంలోని సొసైటీ ఆవరణలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలోని రైతుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిలుకూరి రమేష్ మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చిన మొక్కజొన్నలను వెంటనే కొనుగోలు చేయకపోవడం వల్ల మిగతా రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకురాటానికి స్థలం సరిపోకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని. సొసైటీ స్థలం గుంటలతో లోడకలతో ఉన్నది వర్షం వస్తే పట్టాలు కప్పిన కూడా ఆవరణలో నీళ్ళు నిలబడటం వల్ల మొక్కజొన్నలు తడిసిపోయి మొలకొచ్చే అవకాశం ఉన్నదని, కొనుగోలు చేసిన మొక్కజొన్నలు కూడా సొసైటీ ఆవరణలోనే ఉన్నాయని, సొసైటీ అధికారులని తక్షణమే కొనుగోలు చేసిన వారిని పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్, బిజెపి మండల అధ్యక్షులు భూక్య రమేష్, సిరిపురపు ప్రసాద్, తెల్లం నరసింహారావు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి సిరిపురపు పుల్లారావు, గుగులోత్ రాంబాబు, గోపాల్ రావు, వెంకటేశ్వర్లు, కిరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అలుపెరుగని శ్రామికుడికి విరామం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** విధి నిర్వహణలో అలుపెరగని శ్రామికుడికి ప్రజల నిరాజనం నిరుపేద కుటుంబంలో పుట్టి కుటుంబ బాధ్యతలు అన్ని తన భుజస్తంభాలపై వేసుకొని 150 రూపాయల వేతనంతో మొదలైన ఆయన ప్రస్థానం 38 సంవత్సరాలు పాటు విద్యుత్ శాఖ లో శ్రామికుడిగా చేరి అంచలంచలుగా ఎదుగుతూ లైన్ ఇన్స్పెక్టర్గా పదవి విరమణ పొందుతున్న యడ్ల ప్రభాకర్ కు తోటి ఉద్యోగుల తో పాటు పలు గ్రామాల ప్రజలు ఆయన చేసిన సేవలను కొనియాడారు. వేదుల చెరువు గ్రామంలో యడ్ల మల్లయ్య నాగమ్మ దంపతులకు నలుగురు సంతానం కాగా పెద్ద కుమారుడు యడ్ల ప్రభాకర్ నిరుపేద కుటుంబంలో పుట్టిన ప్రభాకర్ ఇంటికి పెద్ద కొడుకు కావడం కుటుంబ భారమంతా తన భుజస్తంభాలపై వేసుకొని కుటుంబాన్ని మోస్తూ శ్రమించాడు. మొదట విద్యుత్ శాఖ కార్మికుడిగా మొదలైన ఆయన జీవిత గమనం విలేజ్ వర్కర్ గా పని చేసుకుంటూ 2003లో ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించింగా విధి నిర్వహణలో తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ బయ్యారం మండలాలలో పనిచేసి ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని ఒకానొక సమయంలో విద్యుత్ షాకు కు గురై చావు చివర అంచుల వరకు వెళ్లి తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకొని మళ్ళీ విధి నిర్వహణలో తనదైన పాత్ర పోషించాడు. తోటి ఉద్యోగులతో పాటు గ్రామాలలో ప్రజల మన్ననలు పొందిన ప్రభాకర్, పలుపదోన్నతులు పొందాడు ఏప్రిల్ 30న పదవి విరమణ పొందుతున్న ప్రభాకర్ ను తోటి ఉద్యోగులతో పాటు పలు గ్రామాల ప్రజలు ఆయనను ప్రశంసించారు.

## పది ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కేజీవీబీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పది ఫలితాల్లో తిరుమలాయపాలెం కేజీవీబీ జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. తెలంగాణ ప్రభుత్వం 20252026 విద్యా సంవత్సరం గాను పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టుల గాను సుమారు నెలరోజులపాటు వార్షిక పరీక్షలు నిర్వహించింది మార్చి 14 నుంచి ఏప్రిల్ 13 వరకు సబ్జెక్టు సబ్జెక్టుకు విద్యార్థులు చదువుకునేందుకు ఎసులుబాటు కల్పించి పరీక్షలు నిర్వహించింది. తెలంగాణ విద్య బోర్డు బుధవారం విడుదల చేసిన పది ఫలితాల్లో తిరుమలాయపాలెం కేజీవీబీ, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మండలంలోని మొత్తం నాలుగు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా మొత్తం 591 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 554 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఉత్తమ ఫలితాల్లో జల్లేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన జల్లేపల్లి గ్రామానికి చెందిన మేకల జ్ఞానేశ్వరి 581 మార్కులు సాధించి మండల ఫస్టు జిల్లా సెకండ్ గా నిలిచింది పిండిప్రోలు ప్రభుత్వ పాఠశాలలో చదివిన బాలాజీ నగర్ తండాకు చెందిన బోడ భరత్ 577 మార్కులు సాధించి మండల ద్వితీయ స్థానంలో నిలిచారు. తేట్టెలపాడు, మాదిరిపురం పాఠశాలల్లో చదివిన విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. కేజీబీవీ లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలకు స్పెషల్ ఆఫీసర్ రమాకుమారి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## గ్రామ గ్రామాన మేడే వేడుకలు నిర్వహించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో కారేపల్లి కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సమావేశానికి పార్టీ జిల్లా నాయకులు శివ నాయక్, సుంకర బుచ్చయ్య హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మే 1న జరగనున్న 140వ మేడే దినోత్సవాన్ని ప్రతి గ్రామం, పట్టణంలోని ప్రతి వాడలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో దంతాల నారాయణ, నాగేష్, సీతారాములు, తదితరులు పాల్గొన్నారు.

## మహా కుంభాభిషేక మహోత్సవానికి సమీక్షా సమావేశం



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండలంలోని శ్రీశ్రీశ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మే 1 నుండి 6వ తేదీల్లో జరగనున్న మహా కుంభాభిషేక మహోత్సవంపై ఆలయ ప్రాంగణంలో సమీక్షా సమావేశం జరిగింది. స్థానిక ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ పాల్గొని, భక్తులకు తాగునీరు. పారిశుద్ధ్యం, వసతి, రవాణా, భద్రత వంటి సదుపాయాలు సమృద్ధిగా కల్పించాలని సూచించారు. మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. వేదపండితులచే ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం ఆలయానికి ప్రాచుర్యం, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈసమావేశంలో సర్పంచ్ లాకావతు లక్ష్మి, ఉప సర్పంచ్ మారగాని అశోక్, గ్రామ పెద్దలు వనమా గాంధీ, దోసపాటి రాంబాబు, సుగ్గల నరసింహారావు, పరసా వెంకటేశ్వర్లు, వేముల రమణ, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెరుగైన వేతన ఒప్పందం కోసం నిరసన ర్యాలీ

### -14వ వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఐటిసి కర్మాగారంలో జరగబోయే 14వ వేతన ఒప్పందాన్ని మెరుగ్గా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఐఎన్‌టియూసి మిత్రపక్షాల ఆధ్వర్యంలో కార్మికులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. బుధవారం ఉదయం 8గంటలకు జనరల షిఫ్ట్ కార్మికులతో కలిసి ఐటిసి ఏటీఎం చౌరస్తా సెంటర్ నుండి ప్రారంభమైన ర్యాలీ, ఏడీఎం బ్లాక్ వరకు నినాదాలతో సాగింది. కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఐక్యతను ప్రదర్శించారు. 14వ వేతన ఒప్పందంలో రూ 22,000 ప్యాకేజీ, పూర్తి మెడికల్ సదుపాయం కల్పించాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. ఈసందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి, అధ్యక్షులు గొనె రామారావు మాట్లాడుతూ కష్టపడే కార్మికుడికి న్యాయం జరగాలని, మెరుగైన వేతనం కార్మికుల హక్కు అని పేర్కొన్నారు. వేతన ఒప్పందం అమలు అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఏప్రిల్ నెల వేతనం కొత్త ఒప్పందంతో చెల్లించాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం కార్మికులను అయోమయంలోకి నెట్టిందని విమర్శించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని యాజమాన్య అధికారులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రపంచ కార్మిక దినోత్సవం(మేడే) ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) మండల కార్యదర్శి సప్పం నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం బూర్గంపాడులో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ శుక్రవారం 141వ మేడే ఉత్సవాలను మండలంలోని అన్నీ శాఖల కార్యదర్శులు, కార్యకర్తలు, కార్మికులు సంయుక్తంగా పతాకావిష్కరణ జరపాలని కోరారు. కర్షకులు ఎర్ర జెండాను ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు, మండల సీనియర్ నాయకులు బర్ల వెంకటేశ్వర్లు, సొల్లు పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐటి అధ్యాపకురాలు సవితకు డాక్టరేట్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాల సిఎస్‌ఈ విభాగపు సహాయ ఆచార్యురాలు నటువ సవిత కు చైతన్య డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ బుధవారం తెలిపారు. డేటా ఇంటిగ్రిటి వెరిఫికేషన్ అండ్ హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ ఎనేబుల్డ్ ఇన్‌ట్రూషన్ డిటెక్షన్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్ ఎన్విరాన్మెంట్స్ అనే అంశంపై డా॥ ఇ. సాయికిరణ్ పర్యవేక్షణలో తాను చేసిన పరిశోధనకు గాను కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం నుండి పట్టాను పొందినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సెక్యూరిటీ, డీప్ లెర్నింగ్ వంటి ఆధునీక టెక్నాలజీలపై పరిశోధన ద్వారా తన అనుభవం విద్యార్థులకు సిఎస్‌ఈ విభాగాభివృద్ధికి దోహదపడుతుందని కళాశాల ప్రిన్సిపల్ జి. రాజ్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం ఎన్. సవితను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రజల ముంగిటకే పాలన.. సమస్యల పరిష్కారమే లక్ష్యం

**-3 నెలల్లో దరఖాస్తుల కొలిక్కి కార్యాచరణ**
**-పాలేరు ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**





**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రజల సమస్యలను వారి గడప వద్దే పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి వెల్లడించిన కీలక అంశాలు ఇలా ఉన్నాయి.

**సమస్యలకు డెడ్ లైన్....** ప్రజల నుండి వచ్చిన న్యాయబద్ధమైన దరఖాస్తులన్నింటినీ మూడు నెలల్లోగా పరిష్కరించేందుకు స్పష్టమైన కార్యాచరణ రూపొందిం చామన్నారు.

**క్లస్టర్ విధానం....** పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని 3 క్లస్టర్లుగా విభజించి, ప్రతి దరఖాస్తుపై జవాబుదారీతనంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**భూములకు భూధార్...** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం మనిషికి ఆధార్ లాగే, ప్రతి భూమికి భూదార్ నంబర్ ఇస్తున్నాం అని కూసుమంచి మండలంలో దీన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లు...** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. నిర్మాణ పురోగతిని బట్టి ప్రతి సోమవారం లబ్దిదారుల ఖాతాలో నేరుగా బిల్లులు జమ చేస్తున్నామని తెలిపారు.

**మెగా జాబ్ మేళా...** నిరుద్యోగ యువత కోసం మే 4న ఖమ్మంలో భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. 80కి పైగా కంపెనీలు ఇందులో పాల్గొంటాయి అని తెలిపారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**రైతులకు భరోసా...** వరి, మొక్కజొన్న పంటను మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నామన్నారు. నిధులను రికార్డు సమయంలో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు.

**అధికారులకు ఆదేశం...** భూ సేకరణ వంటి పెండింగ్ అంశాలను వారం రోజుల్లోగా పరిష్కరించాలని యంత్రాంగాన్ని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్, అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ బకాయిలు విడుదల



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న రూ 591 కోట్లలో రూ 300 కోట్లు కేంద్రం విడుదల చేసినట్లు ఎంపీడీవో ముత్యాలరావు తెలిపారు. మిగిలిన రూ 291 కోట్లు త్వరలో విడుదల కానున్నాయని చెప్పారు. మంత్రి సీతక్క ఈ సమస్యను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు. విడుదలైన నిధులు కూలీల ఖాతాల్లో జమ కానున్నాయి. వేతనాల చెల్లింపులతో పనులకు హాజరు పెంచాలని రాష్ట్ర సంచాలకులు దివ్యా దేవరాజన్ ఆదేశించగా, మండలంలో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## జనగణన కు మెటీరియల్ అందజేత

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** జనగణన కు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మూడు రోజుల పాటు మండల కేంద్రంలో ఎన్యూమరేటర్స్, సూపర్వైజర్స్ లకు శిక్షణ అందించారు. బుధవారం ముగింపు సందర్భంగా వారికి టిరియల్ ను అందించారు. నేలకొండపల్లి డిప్యూటీ తహశీల్దార్ కనకం నరసింహారావు చేతుల మీదుగా సామాగ్రి, పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనగణన లో ఎలాంటి తప్పిదాలు లేకుండా సమగ్రంగా క్షేత్ర స్థాయిలో చేపట్టాలని సూచించారు. ప్రతీ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయటంతో పాటు ప్రభుత్వం కు అవసరమైన గణాంకాలను సేకరించాలని సూచించారు. మహా ఘట్టం ను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. విద్యావంతులు, మేధావులు, యువకులు స్వీయ గణన చేసుకున్నప్పుడు అధికారులు ఇంటికి వచ్చినప్పుడుపత్రాన్ని చూపితే సరిపోతుందన్నారు. అందులో అడిగే 34 ప్రశ్నలకు సమాధానం సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, ఉపాధ్యాయులు టి.వెంగళరావు, తొర్తి సురేష్, గోవింద రావు, హరిత, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సిలో హార్వెస్ట్‌కు ఉన్నతశ్రేణి ఫలితాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు ఉన్నతశ్రేణి ఫలితాలు సాధించి అగ్రభాగాన నిలిచారని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల యాజమాన్యం తెలిపింది. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో పాఠశాలకు చెందిన గుండ్ల జశ్వంతి 600 మార్కులకు 584 మార్కులు సాధించిందని తెలిపారు. మహిరా మీర్జా 583, ఉదారపు చరణ్ 579, కొల్లి సిద్దార్థ్ 579, కె. శ్రీరేష్మ 576, చింతల సాయితరుణ్ 576, వై. దీపిక రెడ్డి 574, వి. హర్షిత్ 574 మార్కులు సాధించినట్లు తెలిపారు. 550 మార్కులకు పైగా 28 మంది, 500లకు పైగా మార్కులు 80 మంది సాధించారని తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులలో పలువురు విద్యార్థులు ఎ1గ్రేడ్లు సాధించారన్నారు. 141 మంది 141 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్బంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్. పార్వతిరెడ్డి లు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పది ఫలితాల్లో న్యూవిజన్ విజయకేతనం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి ఫలితాల్లో ఖమ్మం నగరంలోని న్యూవిజన్ పాఠశాల విద్యార్థిని పసుపులేటి హంసిని 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేసినట్లు న్యూవిజన్ విద్యా సంస్థల ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్ తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో తమ పాఠశాల నుంచి పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో 90 శాతానికి పైగా మార్కులు 290 మంది విద్యార్థులు సాధించారన్నారు. 550కు పైగా మార్కులు 230 మంది, 500లకు పైగా మార్కులు 460 మంది ఉన్నారని మిగిలిన విద్యార్థులంతా 430కు పైగా మార్కులు సాధించి ఏ పాఠశాల సాధించని ఘనత న్యూవిజన్ సాధించిందన్నారు. అన్ని సబ్జెక్టులలో నూటికి నూరు మార్కులు తమ పాఠశాల విద్యార్థులు సాధించడం హర్షణీయమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ సిహెచ్ జికె ప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్లు సిహెచ్ కార్తీక్, డైరెక్టర్ సిహెచ్ గోపీచంద్, ప్రిన్సిపాల్ ఎండి అబాద్‌అలీ, జెవి మైఖేల్ తదితరులు అభినందించారు. ఇంతటి విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందానికి సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

## మంత్రి పొంగులేటికి ఖమ్మంరూరల్ విలేకరుల వినతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఖమ్మంరూరల్ మండల విలేకరులు వినతిపత్రాన్ని అందజేశారు. బుధవారం ఆరెంపుల గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో విలేకరుల కు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి సమస్యను పరిశీలించి త్వరలోనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విలేకరులు వెంకటేశ్వర్లు(సాక్షి), ఉపేందర్(ఆంధ్రజ్యోతి), రంగారావు(ఆంధ్రప్రభ), లక్ష్మణ్(నమస్తేతెలంగాణ), అశోక్(ప్రజాపక్షం), వెంకట్(జనం సాక్షి), మురిళి(ఉదయం) పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో గీతాంజలి జైత్రయాత్ర



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి ఫలితాల్లో ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్‌లో గల గీతాంజలి విద్యానికేతన్ ఉత్తమ ఫలితాలు సాధించి జైత్రయాత్ర సాగించిందని పాఠశాల కరస్పాండెంట్ టివి అప్పారావు తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో పి. నవదీప్ 600 మార్కులకు 591, ఎం. యశశ్విత 591, యు. వేదశ్రీ 588, ఎస్. షాన్విత 585, ఎస్‌కె ఆసిఫ్ 582, పి. సృష్టి 575, ఎస్‌డి ఫజల్ 570, సిహెచ్ వెంకటలక్ష్మి 569, ఆర్. కళ్యాణ్ రెడ్డి 564, వి. దీక్షిత 560, ఎం. చరణ్ 559, జే. సాత్విక్ 557, ఎస్‌కె ఖాజా 556, జి. మోక్షజ్ఞ 554 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు కరస్పాండెంట్ టివి అప్పారావు, డైరెక్టర్లు టి. పద్మ, టి. అరుణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

## గిరిజన విద్యార్థులకు మార్కుల పంట

**- అభినందించిన ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం:** విడుదలైన పదో తరగతి ఫలితాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో గిరిజన విద్యార్థినీ విద్యార్థులు మంచి మార్కులు సాధించారని ఐటిడిఏ పిఓ రాహుల్ తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో బాలబాలికలు 2025 మంది పరీక్షలు రాయగా 1849 మంది పాస్ అయ్యారు. వసతి గృహాల్లో 171మంది పరీక్షలురాయగా, 145 మంది ఉత్తీర్ణులయ్యారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో మొత్తం 30 మంది పరీక్షలు రాయగా మొత్తం విద్యార్థులు పాసయ్యారని చెప్పారు. మొత్తంగా 90.88 శాతం పాసయ్యారని చెప్పారు. 22 గిరిజన ఆశ్రమ పాఠశాలలు, 5 వసతి గృహాలలో 100 శాతం ఉత్తీర్ణత వచ్చిందన్నారు. ఖమ్మం జిల్లాలోని 552 మంది రాయగా 524 మంది పాసుకావడంతో 94.93 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

## మండలంలో పదో తరగతి ఫలితాల్లో 98శాతం ఉత్తీర్ణత



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో ఎర్రుపాలెం మండలం 98శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఓ మురళీమోహన్‌రావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 98శాతం, ప్రైవేట్ పాఠశాలల్లో 98.54శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రభుత్వ పాఠశాలల నుండి 290మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 285మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఓ తెలిపారు. జమలాపురం, బనిగండ్లపాడు, భీమవరం, రాజుపాలెం, మామనూరు, రామన్నపాలెం, రేమిడిచర్ల ఉన్నత పాఠశాలలు నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలో 119 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 119మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు భీమవరం పాఠశాల విద్యార్థిని వై.కీర్తిరెడ్డి 574మార్కులు సాధించినట్లు తెలిపారు. కేజిబివి 95శాతం, గురుకుల 98.7శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మీనవోలు శ్రీ భాస్కర మెమోరియల్ విద్యానికేతన్ విద్యార్థి పింగళి భువనేశ్వరరెడ్డి 581 మార్కులు సాధించి మధిర, ఎర్రుపాలెం రెండు మండలాల స్థాయిలో మొదటి స్థానం సాధించాడని భాస్కర స్కూల్ కరస్పాండెంట్ బి.సూర్యనారాయణ, డైరెక్టర్ వెంకటేశ్వరరావులు తెలిపారు. ఎర్రుపాలెం ఎస్‌వి అకాడమిలో 20 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 20మంది ఉత్తీర్ణత సాధించినట్లు, రమ్యశ్రీ 566 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్, చైర్మన్ ఎం.శ్యాంప్రసాద్ తెలిపారు.

## పది ఫలితాలలో ప్రభుత్వ విద్యార్థుల ప్రభంజనం






**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని 10వ తరగతి ఫలితాలలో పలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి నివేదిత తెలిపారు. ఎర్రబోయినపల్లి, చెన్నూరు, చిన్న కోరుకొండి, వెన్నవల్లి, పేరువంచ, గురుకులం పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాల లలో 100% ఉత్తీర్ణత సాధించారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 100% అత్యధికంగా విద్యార్థిని విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం పట్ల ప్రజా ప్రతినిధులు అధికారులు హర్షిస్తూ వారిని అభినందించారు. ఎంతో శ్రమించి కష్టపడి ఏకాగ్రతతో చదివి ఉత్తీర్ణత సాధించడం పట్ల ఉపాధ్యాయులను విద్యార్థులను మండల ప్రజలు అభినందిస్తున్నారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలలో మండల ప్రథమ ద్వితీయ స్థానాలు బాలాజీ స్కూల్ కు దక్కింది. తృతీయ స్థానం ప్రతిభ, చతుర్ధ స్థానం తెలంగాణ గ్రామర్ స్కూల్, ఐదో స్థానంలో లిటిల్ ఫ్లవర్ విజ్ఞాన్ లేమర్ పాఠశాలలో ఆయా స్థానాలలో ఉన్నవి.